క్లుప్తంగా

బేస్‌బాల్ జట్టుకు వినుకొండ విద్యార్థి



వినుకొండ(నూజెండ్ల): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన విద్యార్థి ఎస్. రాము యూనివర్సిటీ బేస్‌బాల్ జట్టుకు ఎంపికై నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు తెలిపారు. రాము ఆల్ ఇండియా యూనివర్సిటీ టోర్నమెంట్‌లో రాణిస్తున్నాడని, 2020–21లో ఇండియా పోటీల్లో నాగార్జున యూనివర్శిటీ టీమ్ మొదటిస్థానం సాధించడంలో రాము కీలకపాత్ర పోషించాడన్నారు. 2021–22లో చండీఘడ్‌లో జరిగిన జాతీయస్థాయి యూనివర్సిటీ పోటీల్లో నాగార్జున యూనివర్సిటీ జట్టు 4వ స్థానంలో నిలిపారన్నారు. 2022–23 గాను మరలా రాము యూనివర్సిటీ జట్టుకు ఎంపికై అస్సాంలో జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థి రామును ప్రిన్సిపాల్‌తో పాటు ఇంచార్జి పీడీ జగదీష్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



యడ్లపాడు: మండలంలోని సొలస గ్రామంలో వేంచేసి ఉన్న వీరబ్రహ్మేంద్రస్వామి దేవాలయంలో వార్షిక కల్యాణ మహోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో తొలి రోజున మూల విరాట్‌కు పంచామృత అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామంలోని భక్తులు పాల్గొని స్వామి వారికి అభిషేక సేవలను అందజేశారు. మంగళవారం ఇదే ఆలయంలోని ప్రసన్నాంజనేయస్వామి వారికి అభిషేక పూజలు, నాగవల్లీ దళార్చనా కార్యక్రమాలు ఉంటాయన్నారు.

యడ్లపాడులో దొంగలు హల్‌చల్

యడ్లపాడు: ఎవరూ లేని ఇంట్లో దొంగలు హల్‌చల్ చేసిన ఘటన యడ్లపాడు గ్రామంలో జరిగింది. బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని ముత్తవరపు సామ్రాజ్యం ఆరోగ్యం బాగోలేకపోవడంతో ఆదివారం గుంటూరులో నివసిస్తున్న తన కుమారుడు నాగచౌదరి వద్దకు వెళ్లింది. సోమవారం ఉదయం సమీప నివాసితులు సామ్రాజ్యం ఇంటి తలుపు తెరిచి ఉండటాన్ని గమనించి ఆమెకు సమాచారం అందించారు. ఊరి నుంచి వచ్చి చూడగా ప్రధాన తలుపుకు వేసిన తాళం పగులగొట్టి ఇంటిల్లోని సామగ్రి, దుస్తులు చెల్లాచెదురుగా పడి ఉండటాన్ని గమనించారు. ఇంట్లో బంగారం, నగదు ఏమీ లేవని సదరు ఘటన యడ్లపాడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

బాధ్యతలు స్వీకరించిన ఏహెచ్‌ఏలు

శావల్యాపురం: పశుసంవర్ధక శాఖలో ఏహెచ్‌ఏ (పశు సంవర్ధక శాఖ సహాయకులు) పోస్టులు భర్తీ చేయటంతో ఆయా గ్రామాల్లో సోమవారం జాయిన్ అయినట్లు ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి తెలిపారు. మండలంలోని గుంటుపాలెం గ్రామానికి నూతనంగా బెల్లంకొండ అజయ్, మతుకుమల్లి –సీహెచ్.రాధ, శానంపూడి –కె.మేఘన, పిచికలపాలెం–పి.బ్రహ్మేశ్వరరావు, కనమర్లపూడి –వై. అబ్రహాంలు నియమాకం కాగా వీరందరూ ఆయా గ్రామాల్లో విధుల్లోకి హాజరైనట్లు ఎంపీడీవో తెలిపారు.

వలంటీరు పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలి

నరసరావుపేట: పురపాలక పరిధిలో ఖాళీగా ఉన్న ఏడు వలంటీరు పోస్టుల భర్తీకి ఈనెల ఐదవ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి సోమవారం పేర్కొన్నారు. ఎస్‌ఎస్‌సీ లేదా సమానమైన పరీక్షల్లో అర్హత పొంది ఫిబ్రవరి పదోతేదీనాటికి 18 ఏళ్ల నుంచి 35 ఏళ్లలోపు వయస్సుగలవారై ఉండాలని సూచించారు. ఖాళీలకు సంబంధించిన నోటిఫికేషన్ సచివాలయాలు, మున్సిపల్ కార్యాలయంలో ఉంచడం జరిగిందన్నారు.

డొంక పునరుద్ధరించాలంటూ యడ్లపాడు వాసుల వినతి

యడ్లపాడు: పొలాలకు వెళ్లే డొంకమార్గాన్ని పునరుద్ధరించి రైతుల ఇబ్బందుల్ని తొలగించాలని అధికారులకు యడ్లపాడు వాసులు వినతి పత్రాన్ని సోమవారం సమర్పించారు. యడ్లపాడులోని కారుచోల రోడ్డులో ఓటికుంట చెరువు మీదుగా విశ్వేశ్వర స్వామి మాన్యం వరకు ఉన్న డొంక ద్వారా గతంలో రైతులు అరకలు, ఎడ్లబండ్లతో రాకపోకలు సాగించే వారన్నారు. ఈమార్గంలో రోడ్డును నిర్మించి రైతుల ఇక్కట్లు తొలగించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. వినతిని ఎంపీడీవో కార్యాలయం సీనియర్ అసిస్టెంటుకు అందించిన వారిలో కృష్ణ, పోపూరి వెంకటరత్తయ్య, సుబ్బారావు, సోమయ్య, నాగచౌదరి తదితరులు ఉన్నారు.

సిద్ధమైన వేల్పూరు సబ్ స్టేషన్

గత పాలకులు ఏర్పరచిన చీకట్లను పారదోలే ప్రయత్నంలో వైఎస్సార్ సీపీ విజయవంతమైంది. ఎంతో కాలంగా శావల్యాపురం మండలంలో నెలకొన్న లోఓల్టేజీ, విద్యుత్ కోత సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు దృష్టిసారించారు. దీనికి సబ్ స్టేషన్ ఏర్పాటే శరణ్యమని భావించి వెనువెంటనే నిధులను తెప్పించి పనులు ఆరంభింప చేశారు. వేల్పూరులో నాలుగు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మాణం పూర్తి చేసుకున్న విద్యుత్ సబ్‌స్టేషన్ బుధవారం నుంచి సేవలు అందించనుంది.

- సమసిపోనున్న విద్యుత్ కోతలు, లోఓల్టేజీ
- 6న స్విచ్ ఆన్‌చేసి ఆరంభించనున్న పెద్దలు
- రూ. 4 కోట్ల వ్యయంతో నిర్మాణం
- 5 వేల నివాస గృహాలకు విద్యుత్ సరఫరా



సిద్ధం చేసిన విద్యుత్ సబ్ స్టేషను

శావల్యాపురం: మండలంలోని వేల్పూరు గ్రామ సమీపాన రూ.4 కోట్ల వ్యయంతో నూతనంగా 33/11 కేవీ సామర్థ్యం కలిగిన విద్యుత్ సబ్ స్టేషను పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నూతన విద్యుత్ సబ్‌స్టేషను పరిధిలో అనుసంధానం చేయడం ద్వారా గ్రామాల వారీగా విద్యుత్ మీటర్ల వివరాల మేరకు వేల్పూరు గ్రామంలో విద్యుత్ మీటర్లు–2 వేలు వెలమవారిపాలెం–200, గంటావారిపాలెం–460, పోట్లూరు–1100, బొగ్గరం –900 ఉన్నాయి. నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ వల్ల అనధికార విద్యుత్ కోతల నియంత్రణతోపాటు వినియోగదారులకు మెరుగైన సేవలు అందుబాటులోకి వస్తాయి. దీనికితోడు మండలంలోని కారుమంచి, శావల్యాపురం గ్రామాల్లోని విద్యుత్ సబ్ స్టేషన్ల పరిధిలో అదనపు లోడు భారం తగ్గతుంది. భవిష్యత్‌లో విద్యుత్ అంతరాయం వాటిల్లితే ప్రత్యామ్నాయంగా వేల్పూరు నూతన విద్యుత్ సబ్ స్టేషను పరిధిలో నుంచి మిగిలిన గ్రామాల్లోకి విద్యుత్ సరఫరా ఇచ్చేలా క్షేత్రస్థాయిలో విద్యుత్ అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారు. ఒక్కో సబ్‌స్టేషను పరిధిలో 5 వేల నివాస గృహాలకు అధికారికంగా విద్యుత్ సరఫరాతో పాటు 1500 వ్యవసాయ విద్యుత్ మోటర్లకు సరఫరా చేసే ఆధునిక సామర్థ్యం కలిగిన యంత్ర పరికరాలు అమర్చుతున్నారు. స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో గ్రామస్తులు ప్రజాప్రతినిధులు సహకారంతో పనులు శరవేగంగా జరగటంతో పాటు ఈనెల 6న ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

శుభపరిణామం



స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సారథ్యంలో వేల్పూరులో నూతన విద్యుత్ సబ్‌స్టేషను ఏర్పాటు శుభపరిణామం. దీనివల్ల విద్యుత్ కోతల నియంత్రణతో పాటు మెరుగైన సేవలు అందుతాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి పనులు చేయటం ప్రభుత్వ పనితీరుకు నిదర్శం.

–వడ్రాణం నాగేశ్వరరావు, గంటావారిపాలెం

పారదర్శకంగా నిర్మాణ పనులు



నూతన విద్యుత్ సబ్‌స్టేషను నిర్మాణ పనులు పారదర్శకంగా జరిగాయి. 5 ఎంవీ వాట్స్ విద్యుత్ సామర్థ్యం ట్రాన్స్‌ఫార్మర్ (పవర్ ట్రాన్స్‌ఫార్మర్) బ్రేకేఫ్ పనులు పూర్తి చేశాం. గ్రామస్తులు సహకారంతో పాటు విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా పనులు త్వరతిగతిన పూర్తి చేశాం.

–సంపెంగుల గాంధీ, మండల విద్యుత్ శాఖాధికారి

వాటర్ ప్లాంట్ ద్వారా నీటి సౌకర్యం అభినందనీయం

వేసవిలో గ్రామాల్లో సొంత నిధులతో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా



పేరూరుపాడులో ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బొల్లా

బొల్లాపల్లి: గ్రామాల్లో ఆర్వో వాటర్ ప్లాంట్ ద్వారా శుద్ధమైన తాగునీటిని అందిస్తున్నట్లు ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అన్నారు. మండలంలోని పేరూరుపాడు గ్రామంలో ప్రభుత్వం, బాల వికాసం స్వచ్ఛంద సంస్థ సంయుక్తంగా దేర్పాటు చేసిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను సోమవారం ఎమ్మెల్యే బొల్లా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ ఎం.స్వాతి అధ్యక్షతన ఎర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం కొంత, స్వచ్ఛంధ సంస్థ కొంత మేర నిధులతో సంయుక్తంగా దాహార్తిని తీర్చి, నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయడటం అభినందనీయమన్నారు. మండలంలో భూగర్భ జలాలు అడుగంటి కొంత మేర నీటి కొరత ఉందని, ఆయా గ్రామాల్లో సొంత నిధులతో మంచినీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నామన్నారు. గండిగనుమల, మన్నేపల్లి తండా, మేకలదిన్నే, గంగుపల్లి, తండా, కంద్రిక, అయ్యన్నపాలెం, రేమిడిచర్ల, దొమలగుండం తదితర గ్రామాల్లో వేసవిని దృష్టిలో ఉంచుకుని ఆయా గ్రామాల్లో ట్యాంకర్ల ద్వారా ప్రజల దాహార్తి తీరుతుందన్నారు. ఎన్నెస్పీ కుడికాలువ ద్వారా బొల్లాపల్లి చెరువుకు నీటి సరఫరాకు ప్రభుత్వం 12 కోట్లు మంజూరు చేయడం జరిగిందని, సాంకేతిక కారణాల వలన పనులు ప్రారంభం కాలేదని తెలిపారు. వరికెపూడిశెల ఎత్తిపోతల నిర్మాణంతో ఈ ప్రాంతం సస్యశ్యామలం కానుందని, అటవీ, పరిపాలన అనుమతి వచ్చింది, వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో కాదాని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ద్వారానే ఎత్తిపోతల పథకం సాధ్యమని ప్రజలు గుర్తుంచుకోవాలన్నారు. చంద్రబాబు 14 ఏళ్ల పాలనలో వరికెపూడిశెలకు శంకుస్థాపనలో శిలాఫలకం మాత్రమే మిగిలిందని, నియోజకవర్గానికి జి.వి.ఎమ్మెల్యేగా పదేళ్ల పనిచేశారని, తాగునీటి సమస్య పరిష్కరించిన దాఖలాలు లేవని విమర్శించారు. పట్టణంలో నీటి సమస్య లేకుండా చేశామన్నారు.

ప్రధానంగా భూగర్భ జలాలు అడుగంటాయని, ప్రత్యామ్నాయంగా మండలంలో సొంతనిధులు వెచ్చించి నీటి సమస్య లేకుండా ట్యాంకర్లు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ డి.ఏలిశమ్మ, వైఎస్ ఎంపీపీ టి.కోటిరెడ్డి, జేడీసీసీ డైరెక్టరు డి.గోవిందునాయక్, మాజీ సొసైటీ అధ్యక్షులు బి.వెంకటేశ్వ రెడ్డి, స్వచ్ఛంద సంస్థ కో ఆర్డినేటరు ఎస్.రాజు, వైఎస్సార్ సీపీ నాయ కులు ఎం.రాజయ్య, బి.గురవయ్య, ఖజ్జాయం లక్ష్మీనారాయణ, ఎస్ మన్నెయ్య, పి.అవినాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే గోపిరెడ్డి విజయం కోసం..



ప్రదర్శన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

నరసరావుపేట: జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థిగా పోటీచేయనున్న డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హ్యాట్రిక్ గెలుపును కాంక్షిస్తూ సోమవారం ఐదో వార్డు శివ సంజీవయ్యకాలనీలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రదర్శన నిర్వహించారు. పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షుడు మల్లెల అశోక్ ఆధ్వర్యంలో మేము సైతం అనే వినూత్న కార్యక్రమం చేపట్టి ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. నాయకులు కొరప్రాటి రాజారావు, కొండెపోగు అచ్చయ్య, విమల, మన్నవ మేరిబాబు, ప్రేమానందరావు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వద్దు

ఎంపీడీవో కవితా చౌదరి



మాట్లాడుతున్న ఎంపీడీవో కవితాచౌదరి

శావల్యాపురం: వేసవిలో అన్నీ గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కొర్రపాటి కవితా చౌదరి అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీడీవో కవితా చౌదరి మాట్లాడుతూ ఈఏడాది అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని ఈక్రమంలో గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా అధికారుల ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ఈనెలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు సాగర్ జలాలు విడుదలవుతాయని, మంచినీటి చెరువులను నింపడానికి క్షేత్రస్థాయిలో తగుచర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని 15 గ్రామపంచాయతీలో 403 చేతి పంపులు ఉన్నాయని అన్నీ పనిచేసేలా పర్యవేక్షణ చేయాలని ఏమైనా మరమ్మతులకు గురైతే చేతి పంపులు మెటీరియల్ సిద్ధంగా ఉందని లిఖిత పూర్వకంగా తెలియజేస్తే సత్వరమే మరమ్మతులు చేయించటానికి సిద్ధంగా ఉండాలన్నారు. తాగునీటి విషయంలో ఫిర్యాదులకు తావులేకుండా అన్నీ గ్రామాల్లోని పంచాయతీ కార్యదర్శులు పూర్తిస్థాయిలో బాధ్యత వహించాలన్నారు. ప్రభుత్వ పథకాలు అమలు తీరు ఆన్‌లైన్ విధానం వంటి పనులన్నీ పాదర్శకంగా చేయాలన్నారు. ఈసమావేశంలో ఈవోపీఆర్‌డీ పి.సుగుణ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మూఢవత్ ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

అపోహలు నమ్మకండి

తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య

శావల్యాపురం: ఎన్నికల కమిషనర్ ఆదేశాలు మేరకు అర్హత ఉన్న వారందరికీ ఓటు హక్కు కల్పిస్తామని తహసీల్దారు నక్కా లక్ష్మి లావణ్య అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయంలో తహసీల్దారు మాట్లాడుతూ ఓట్ల చేర్పులు మార్పులు తొలగింపులు పార్టీలకు అతీతంగా చేస్తున్నట్లు తెలిపారు. డబల్ ఎంట్రీల వ్యవహారంలో సమగ్ర ఆధారాలు అందజేసిన వారి ఓట్లు తొలగిస్తామన్నారు. ఇప్పటి వరకు ఫాం–7 అర్జీలు పెండింగ్‌లో లేకుండా క్షేత్రస్థాయిలో చర్యలు తీసుకున్నామన్నారు. ఓట్ల విషయంలో ప్రజలు అపోహలు నమ్మవద్దన్నారు. మండలంలోని గుంటుపాలెం గ్రామంలో పోలింగ్ కేంద్రంలో మౌలిక వసతులు సక్రమంగా లేకపోవటం వల్ల సమగ్ర ఆధారాలను పరిశీలించిన అనంతరం పోలింగ్ కేంద్రం ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు మార్పు చేశామన్నారు. ప్రస్తుతం ఈ పోలింగ్ కేంద్రంపై వస్తున్న ఆరోపణలపై మరలా విచారణ చేసి నివేదికను కలెక్టరుకు పంపామని, ఉన్నతాధికారులు ఆదేశాలు మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు. ఇరు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు సంయమనం పాటించాలన్నారు. ఇలాంటి విషయాలపై అధికారులపై తప్పుడు ప్రచారం చేయటం తగదన్నారు. ఏమైనా అభ్యంతరాలు ఇబ్బందులు ఉంటే నేరుగా తహసీల్దారును సంప్రదించాలన్నారు. గత వారం రోజులుగా ఎన్నికలకు సంబంధించి శిక్షణా తరగతులకు హాజరు కావటం వల్ల కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో లేరన్నారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో కె లక్ష్మి

చిలకలూరిపేట: ఏపీ గురుకుల విద్యాలయ ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో కె.లక్ష్మి కోరారు. పట్టణంలోని ఎంఈవో కార్యాలయంలో ఏపీఆర్‌ఈఐఎస్ (ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయ సంస్థ) పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గురుకుల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశంతో పాటు 6,7,8 తరగతులలో ఖాళీలను పూరించేందుకు నిర్వహించే పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. వీటితో పాటుగా ఏపీఆర్‌జేసీలో ఇంటర్మీడియెట్, ఏపీడీసీలో డిగ్రీ ప్రవేశానికి ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ నెల 31తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాజాపేట ఏపీ గురుకుల విద్యాలయ ప్రిన్సిపాల్ ఎస్.సుబ్రమణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

రేషన్ బియ్యం సద్వినియోగం చేసుకోండి



అప్పాపురంలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న తహసీల్దార్ వరకుమార్

నాదెండ్ల: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ఉచిత రేషన్ బియ్యాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ డీవీబీ వరకుమార్ చెప్పారు. మండలంలోని అప్పాపురం గ్రామంలో రేషన్ బియ్యం పంపిణీని పరిశీలించారు. రేషన్‌కార్డులో ఉన్న సభ్యుల ప్రాతిపదికన ఒక్కొక్కరికీ 5 కేజీల చొప్పున ఉచితంగా అందించాలని, ఏఏవై కార్డులకు 35 కేజీల బియ్యం అందించాలన్నారు. ప్రతి మూడు నెలలకోసారి కేజీ కందిపప్పు రూ.67లకు, అరకేజీ పంచదార రూ.17లకు అందించాలన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ ప్రతి ఇంటికీ వాహనం ద్వారా రేషన్ పంపిణీ చేయాలన్నారు. పంపిణీని సక్రమంగా చేయాలని, లబ్ధిదారుల నుంచి ఫిర్యాదులు వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

మండలంలోని సంకురాత్రిపాడు, జంగాలపల్లె గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సోమవారం స్థానిక వీఆర్వోలతో కలిసి తహసీల్దార్ డీవీబీ వరకుమార్ పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక వసతులను పరిశీలించారు. త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఓటర్లకు ఎలాంటి అసౌకర్యం ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని స్థానిక వీఆర్వోలను ఆదేశించారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడాలన్నారు. మండల పరిధిలో మొత్తం 57 పోలింగ్ కేంద్రాలున్నాయని, సంకురాత్రిపాడులో 2, జంగాలపల్లెలో 1 కేంద్రాలను పరిశీలించారు. వారితో పాటూ ఆర్ఐ రమీజా, వీఆర్వోలు, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

గొరిజవోలులో...

మండలంలోని గొరిజవోలు గ్రామానికి చెందిన కందుల కాశిరెడ్డి భార్య హైమావతి ఇరవై ఏళ్ళ క్రిందట యకరం పొలంలో టేకు మొక్కలు నాటామని, ప్రస్తుతం వీటిని విక్రయించేందుకు అనుమతి కావాలని తహసీల్దార్‌కు అర్జీని అందించారు. ఈమేరకు సోమవారం తహసీల్దార్ వరకుమార్ రెవెన్యూ సిబ్బందితో కలిసి టేకు మొక్కలు పరిశీలించారు. వారితో పాటూ వీఆర్వో అశోక్ ఉన్నారు.

భూమిని పరిశీలించిన ఆర్డీవో సరోజిని



భూమిని పరిశీలిస్తున్న ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ వరకుమార్

నాదెండ్ల: గణపవరం గ్రామ రెవెన్యూ పరిధిలోని నూతన మార్కెట్ యార్డు పక్కనే ఉన్న భూమిని నరసరావుపేట ఆర్డీవో పి.సరోజిని రెవెన్యూ సిబ్బందితో కలిసి సోమవారం పరిశీలించారు. సర్వే నెంబర్ 513–ఎ, 514–ఎలో కొమ్మినేని శోభారాణి, మక్కెన వంశీకృష్ణలకు చెందిన 73 సెంట్లు భూమిని ల్యాండ్ కన్వర్షన్ చేశారు. ఇందులో పెట్రోల్ బంకు నిర్మాణం చేసేందుకు ఎన్‌వోసీ జారీ చేయమని భూయజమానులు కోరడంతో సోమవారం ఆ భూమిని ఆర్డీవో సరోజిని, తహసీల్దార్ డీవీబీ వరకుమార్, సర్వేయర్ అబ్బూరి శ్రీనివాసరావు, ఆర్ఐ షేక్ రమీజాలతో కలిసి పరిశీలించారు. కార్యక్రమంలో వీఆర్వో సాంబశివరావు, రెవిన్యూ సిబ్బంది ఉన్నారు.

పల్స్ పోలియో కార్యక్రమ పరిశీలన



చిన్నారుల చిటికెన వేలుపై సిరా మార్కు పరిశీలిస్తున్న డబ్ల్యూహెచ్‌వో ప్రతినిధి కోటేశ్వరరావు

చిలకలూరిపేట: పల్స్ పోలియో నిర్వహించిన తీరుపై పరిశీలన కార్యక్రమాన్ని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి కె.కోటేశ్వరరావు సోమవారం నిర్వహించారు. మండలంలోని బొప్పూడి, తాతపూడి గ్రామాలలో పర్యటించి ఇంటింటి డోర్‌మార్క్ కార్యక్రమం నిర్వహించారు.

ఇందులో భాగంగా ఇళ్లకు వెళ్లి ఐదు సంవత్సరాల లోపు పోలియో చుక్కలు వేశారా లేదా అన్న దానిపై పిల్లల ఎడమచేతి చిటికెన వేలుపై సిరా మార్కు ఉన్నదా లేదా అని పరిశీలించారు. పల్స్ పోలియో నిర్వహించిన తీరుపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి నీలం రామకోటేశ్వరరావు, డాక్టర్ పి హరిహరన్,ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటింటా జ్వరాలపై సర్వే



ఇంటింటా జ్వరాల సర్వే చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

దొడ్లేరు(క్రోసూరు): ఇంటింటా ప్రజలు జ్వరాలు బారిన పడి ఉన్నారని, ప్రభుత్వం వెంటనే వైద్యం అందించాలని వచ్చిన వార్తలపై దొడ్లేరు సెక్టర్ వైద్యులు డాక్టర్ మహమ్మద్ సాద్ సోమవారం స్పందించారు. జ్వరాలు ఉన్న సమాచారం తమ దృష్టికి వచ్చిందని, అప్పటి నుంచి ఇంటింటా జ్వర సర్వే చేయించామని, వైద్యం కూడా అందిస్తున్నామని తెలిపారు. గుడిపాడులో ప్రస్తుతం జ్వరాలు లేవన్నారు. అదేవిధంగా గరికపాడు, గాదెవారిపాలెంలో ముగ్గురికి మాత్రమే జ్వరాలున్నాయని చెప్పారు. పదిరోజుల క్రితం వైరల్ జ్వరాల బారిన పడ్డవారు పది మంది ఉన్నారని.. వారికి ఇప్పటికీ వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. కాళ్లుచేతులు పట్టుకుపోతున్న సమాచారంపై స్వయంగా రోగుల ఆరోగ్యంపై శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. సోమవారం ఆయా గ్రామాల్లో వీధుల్లో దోమల నివారణ మందు పిచికారి, ఫాగింగ్, పారిశుద్ధ్య పనులు చేపట్టామని, జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేసినట్లు తెలిపారు. జ్వరాలుంటే స్థానిక ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లకు చెప్పవచ్చునని, వీలైతే సెక్టార్ డాక్టర్ దృష్టికి తీసుకొనిరావచ్చునన్నారు.

భార్గవ శర్మకు ఉత్తమ పండిత పురస్కారం



సత్తెనపల్లి: హిందూ ధర్మ పరిరక్షణ సేవలను గుర్తించి మండలం పెద్దమక్కెన గ్రామలోని శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి దేవాలయ అర్చకుడు దాములూరి భార్గవ శర్మకు ఉత్తమ పండిత పురస్కారాన్ని శైవాగమ విద్వాన్ అనే బిరుదును సర్ సీవీ రామన్ అకాడమీ.. ప్రదానం చేసింది. హైదరాబాద్‌లోని హరిహర కళాక్షేత్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో భార్గవ్ శర్మను సువర్ణ కంకణం, సువర్ణ పతకంతో సత్కరించారు. ఈ సందర్భంగా దాములూరి భార్గవ్ శర్మను సోమవారం పలువురు అర్చకులు ప్రత్యేకంగా అభినందించారు.

వార్డు వలంటీర్ల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సత్తెనపల్లి: పురపాలక సంఘ పరిధిలో 17 వార్డు వలంటీర్ల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని రంగా కాలనీలో –5, క్రిస్టియన్ పేట–1, మార్కెట్ యార్డ్ ఏరియా –2, భవిరిశెట్టి వారి వీధి –1, ఓల్డ్ సాలిపేట –1, వెంకటపతి నగర్‌లో –2, శాలివాహన నగర్‌లో –1, వడ్డవల్లి ఏరియా –2, వెంగళరెడ్డి నగర్‌లో –2 వార్డు వలంటీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. పదో తరగతి లేదా తత్సమా పరీక్షల్లో ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఆధార్ కార్డు, పదో తరగతి సర్టిఫికెట్‌లో పుట్టిన తేదీ ఒకటే ఉండాలని తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో నివాసితులై, 2024 ఫిబ్రవరి 10 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారై 35 సంవత్సరాలు దాటని వారై ఉండాలన్నారు. మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు వర్తిస్తాయన్నారు. మంగళవారంలోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 6న దరఖాస్తుల పరిశీలన, 7న మౌఖిక పరీక్ష, అదేరోజు వలంటీర్లుగా ఎంపికై న వారి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు. ఈ నెల 8 నుంచి వలంటీర్లు పని చేయుట ప్రారంభించాల్సి ఉంటుందన్నారు. ఇతర వివరాలకు కార్యాలయం లేదా మున్సిపల్ మేనేజర్‌ను సంప్రదించాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరి మృతి

వెల్దుర్తి: కల్లంలో మిర్చికి కాపలా కాసేందుకు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని టాటా మ్యాక్స్ ఢీ కొట్టడంతో మండలంలోని మండాది గ్రామానికి చెందిన శీలం శివారెడ్డి (50), శీలం కోటిరెడ్డి (35)లు అక్కడికక్కడే మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ఇద్దరు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా మాచర్ల నుంచి శిరిగిరిపాడు వైపు వెళ్లే వాహనం ఢీ కొట్టడంతో వారు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. గ్రామంలో నుంచి జాతీ య రహదారి దాటుతుండటంతో వేగంగా వస్తున్న టాటా మ్యాక్స్ ఢీ కొట్టడంతో మృతి చెందారు. కోటిరెడ్డికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడున్నారు. శివారెడ్డికి కుమార్తె ఉంది. ప్రమాద వార్త తెలుసుకున్న మండాది గ్రామస్తులు విషాదంలో మునిగిపోయారు. విషయం తెలుసుకున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని మృతదేహాలను సందర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

నేడు వైఎస్సార్ సీపీ ఆత్మీయ సమావేశం

హాజరుకానున్న నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త అనిల్‌కుమార్ యాదవ్

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ఆధ్వర్యంలో పార్టీ కుటుంబ సభ్యుల ఆత్మీయ సమావేశం మంగళవారం నిర్వహిస్తున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా నరసరావుపేట లోక్‌సభ సమన్వయకర్త డాక్టర్ పి.అనిల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ హాజరౌతారని వెల్లడించారు. పార్టీ నాయకులు కార్యకర్తలు ముందుగా పట్టణంలోని బ్యాంకు కాలనీలో ఉన్న వైఎస్సార్ సీపీ కార్యాలయానికి ఉదయం 9 గంటలకు చేరుకుని అక్కడి నుంచి డాక్టర్ పి.అనిల్ కుమార్ యాదవ్‌కు ఘన స్వాగతం పలికి ర్యాలీగా ఆర్యవైశ్య కల్యాణ మండపానికి చేరుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ వివిధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్థంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
నరసరావుపేట డివిజన్
99122 25439 (నరసరావుపేట)
90105 83302
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com